క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పర్యటన

కనగానపల్లి: భానుకోటలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి శుక్రవారం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న మినరల్ వాటర్ ప్లాంటును ఎమ్మెల్యే ప్రారంభించనున్నట్లు జెడ్పీటీసీ మారుతీప్రసాద్ తెలిపారు. ఉదయం 10 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి మండల ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలంతా హాజరుకావాలన్నారు.

ప్రజల కోసమే చలివేంద్రాల ఏర్పాటు


చలివేంద్రాన్ని ప్రారంభించిన అధికారులు

పుట్టపర్తి అర్బన్: పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల కోసం అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆర్డీఓ భాగ్యరేఖ పేర్కొన్నారు. ఇటీవల కలెక్టర్ అరుణ్‌బాబు ప్రతి ప్రభుత్వ కార్యాలయం వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే. గురువారం పుట్టపర్తి తహసీల్దార్ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. ప్రతి రోజూ నీరు పోసి ప్రజలకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్‌కుమార్, రూరల్ ఎస్‌ఐ దాదాపీర్, డీటీ నరసింహులు పాల్గొన్నారు.
అమడగూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిశేఖర్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

ఇంటింటికీ తాగునీటి కొళాయి


కొళాయిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

ముదిగుబ్బ: కొండగట్టుపల్లి పంచాయతీలోని పాయగట్టుపల్లి, పైపేడు, మద్దన్నగారి పల్లి, దేవరగుడిపల్లి, పి.కొట్టాల గ్రామాల్లో ఇంటింటికీ కొళాయిలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. గురువారం కొళాయి ఏర్పాటు పనులను పరిశీలించారు. అనంతరం మల్లేపల్లి, తప్పెటవారిపల్లి, కొండగట్టుపల్లి, సచివాలయాలను సందర్శించారు. కార్యక్రమంలో జేఈ ప్రసాద్, సర్పంచ్ పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం ధ్వంసం


మద్యాన్ని ధ్వంసం చేయిస్తున్న పోలీసులు

ధర్మవరం అర్బన్: వివిధ కేసుల్లో పట్టుబడిన కర్ణాటక, ఆంధ్ర మద్యాన్ని టూటౌన్, సెబ్ పోలీసులు గురువారం ధ్వంసం చేశారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడిన 13 కేసుల కర్ణాటక, ఆంధ్రా మద్యాన్ని పట్టణ శివార్లలో లారీతో ధ్వంసం చేయడం జరిగిందని టూటౌన్ సీఐ రాజ, సెబ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. ధ్వంసం చేసిన మద్యం విలువ రూ.55 వేలు ఉంటుందన్నారు. అలాగే వన్‌టౌన్ స్టేషన్ పరిధిలోని 11 ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన కర్ణాటక, ఆంధ్ర మద్యాన్ని ధ్వంసం చేశామని వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, ట్రాఫిక్ సీఐ వహీద్‌బాషా తెలిపారు. మద్యం విలువ రూ.23,593 ఉంటుందని పేర్కొన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిశీలన


మాట్లాడుతున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కృష్ణయ్య

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌ను గురువారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కృష్ణయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత ముదిగుబ్బ ఎస్సీ కాలనీలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలపై ఆరా తీశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారం, ఐరన్ మాత్రలు అందజేయాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందువల్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓలు సరస్వతమ్మ, హృదయాంజలి, సూపర్‌వైజర్ అబ్దుల్ రసూల్, హెల్త్ సెక్రటరీ శాంతకుమారి పాల్గొన్నారు.

రుణాలు రెన్యూవల్ చేసుకోండి

గాండ్లపెంట: స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో పంట రుణాలు పొందిన రైతులు తమకు ఇచ్చిన గడువులోపు రుణాలు రెన్యూవల్ చేసుకోవాలని మేనేజర్ భరత్‌ప్రవీణ్ గురువారం తెలిపారు.

జోరుగా వరి కోతలు

- ఆశాజనకంగా దిగుబడి
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు


హార్వెస్టర్‌తో పంటను నూర్పిడి చేస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: గత 15 ఏళ్లుగా నీటి వసతి లేక పంటల సాగుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. అయితే గతేడాది విస్తారంగా వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు పెరిగాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా పుట్టపర్తి మండలం బత్తలపల్లి చెరువు మరవ పారింది. పుష్కలంగా నీరు ఉండటంతో సుమారు 80 ఎకరాల్లో జోరుగా వరి నాట్లు వేశారు. ఆరుగాలం శ్రమించిన రైతన్నల కష్టం ఫలించింది. ఇప్పుడిప్పుడే వరి కోతలు ప్రారంభమయ్యాయి. పంట దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన సాగు విస్తీర్ణం

జిల్లాలో ప్రవహిస్తున్న చిత్రావతి నదికి పూర్వం పలు గొలుసు కట్టు చెరువులు ఉన్నాయి. ఇవన్నీ చిత్రావతి నది నెలల తరబడి పారితే వాటికి అనుసంధానంగా ఉన్న సప్లయ్ ఛానల్ ద్వారా నీరు పారి చెరువులు నిండేవి. ఈ చిత్రావతి నదికి కోడూరు, బూదిలి, బూడిదగడ్డపల్లి, గోరంట్ల, కరావులపల్లి, పెడపల్లి, బత్తలపల్లి, గువ్వలగుట్టపల్లి, బీడుపల్లి, జగరాజుపల్లి, లోచర్ల అక్కడి నుంచి మరకుంటపల్లి, తలమర్ల, , బుక్కపట్నం, ధర్మవరం చెరువులు ఉన్నాయి. ఇవి ఒకటి నిండి మరువ పారితే మరొక చెరువుకు నీరు వెళ్లేలా కాలువలు ఏర్పాటు చేశారు. ఈ కాలువలతో పాటు కొన్ని చెరువులకు ఇతర నీటి వసతి ఉంది. అయితే బత్తలపల్లి, జగరాజుపల్లి చెరువులకు ఈ చిత్రావతి నుంచి వెళ్లే కాలువలే శరణ్యం. గత యేడాది విస్తారంగా వర్షాలు కురవడంతో చెరువు మరువ పారింది. ఈ సారి వరిసాగు విస్తీర్ణం పెరగడంతో కొంత మేరకు ఆదాయం వస్తుందని రైతులు భావిస్తున్నారు.

వరి కోత మిషన్లకు డిమాండ్

గ్రామాల్లో కూలీల సంఖ్య పూర్తిగా తగ్గిపోవడంతో వరికోత మిషన్లను ఆశ్రయిస్తున్నారు. ఈ మిషన్లను తమిళనాడు నుంచి కొంత మంది వ్యాపారులు అద్దె ప్రాతిపదికన తీసుకొచ్చి పనులు చేయిస్తున్నారు. వీటికి గంటల లెక్కన బాడుగ చెల్లిస్తారు. వరి కోత మిషన్లకు గంటకు రూ.3,500, మొక్కజొన్న కోసే మిషన్లకు రూ.4500, వేరుశనగ కట్టి ఆడించేందుకు రూ.1,200 చొప్పున బాడుగ చెల్లిస్తున్నారు.

'సీఎం జగన్ పాలన బాగుంది'


కొత్తచెరువు: అభిప్రాయం సేకరిస్తున్న పార్టీ సీఈసీ సభ్యుడు కొత్తకోట సోమశేఖర్ రెడ్డి


నల్లమాడ: పెమనకుంటపల్లిలో ఓ ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న దృశ్యం


ఎన్‌పీకుంట: నల్లగుట్టపల్లిలో కరపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో ప్రజల స్పందన

గాండ్లపెంట: మండల పరిధిలోని 7 గ్రామ సచివాలయాల పరిధిలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం జోరుగా సాగుతోంది. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని లబ్ధిదారులకు సూచించారు. మండల పరిధిలోని వంకలోపల్లిలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయులు, ఎంపీపీ తాతం జగన్మోహన్, జేసీఎస్ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.
ఎన్‌పీకుంట: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి గ్రామాల్లో విశేష స్పందన లభిస్తోందని జేసీఎస్ మండల కన్వీనర్ ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని మరికొమ్మదిన్నె, టీఎన్ పల్లి పంచాయితీల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, గృహసారథులు ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వ పాలనపై లబ్ధిదారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. పీపుల్స్ సర్వేలో భాగంగా ఐదు ప్రశ్నలు అడిగి.. వారు చెప్పిన సమాధానాలను ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేశారు. ఇంటి యజమాని అనుమతితో గోడపై స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తిమ్మారెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ ఓబులరెడ్డి, నాయకులు తిరుమల నాయుడు, వెంకటరామిరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


గాండ్లపెంట: వంకలోపల్లిలో పథకాలను వివరిస్తున్న ప్రజాప్రతినిధులు

నల్లమాడ: నల్లమాడ సచివాలయం పరిధిలోని పెమనకుంటపల్లిలో గురువారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఎంపీపీ దుంగావత్ సునీతాబాయి, నాయకులు గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పుల్లగూరపల్లి, కమ్మవారిపల్లి, నల్లసింగయ్యగారిపల్లి, తోలేటిపల్లి గ్రామాల్లో ఎంపీటీసీ రాధయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహమూర్తి, సచివాలయ కన్వీనర్ ఎస్.మహమ్మద్, గృహ సారథులు కులశేఖర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, షాహీదా, వలంటీర్ ఈశ్వరయ్య కార్యక్రమం నిర్వహించారు. దొన్నికోట పంచాయతీ చెర్లోపల్లిలో కార్యక్రమంలో సర్పంచ్ రాగినేని సరస్వతి, నాయకులు నాగరాజు నాయుడు, కమలాకర్ నాయుడు, అశ్వర్థనాయుడు, గెంగినాయుడు, వెంకటశివ, ఆదెప్ప, శివప్ప, గృహ సారథులు శ్రీనివాసులు, అలివేలమ్మ పాల్గొన్నారు.
కొత్తచెరువు: మండల పరిధిలోని బైరాపురంలో పార్టీ సీఈసీ సభ్యుడు కొత్తకోట సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులతో కలసి గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లోచర్ల రాజారెడ్డి, నాయకులు శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
ఓడీ చెరువు: మండలంలోని అన్ని పంచాయతీ గ్రామాల్లో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు ముమ్మరంగా జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఇంటింటా ప్రచారం చేశారు. ఓడీ చెరువు బీసీ కాలనీలో వక్ఫ్ బోర్డు డైరెక్టర్ జౌలిబాబా స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కలసి ఇంటింటా తిరిగి లబ్ధిదారుల అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. వెంకటాపురం పంచాయతీలో చెన్నారెడ్డి,శ్రీనివాసరెడ్డి,వెంకట్రామప్పనాయుడు,టీ.కుంట్లపల్లిలో మధుసూధననాయుడు, చంద్రమౌళి,గంగిరెడ్డి,ఆదినారాయణరెడ్డి, తదితరులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు.
నల్లచెరువు: మండల పరిధిలోని పంతుల చెరువు పంచాయతీలో సర్పంచ్ స్వర్ణలత ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జరిగింది. గృహ సారథులు, వలంటీర్లతో కలసి ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి


ఉపాధి కూలీల సమస్యలను తెలుసుకుంటున్న అధికారులు

బత్తలపల్లి: ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేసుకుంటే ప్రతి కూలీకి రూ.272 కూలీ లభిస్తుందని ఎంపీడీఓ శ్రీదేవి అన్నారు. గురువారం మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామంలో జరుగుతున్న 'అమృత్ సరోవర్' ఉపాధి పనులను ఏపీఓ ఆదెప్పతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధి కూలీలకు వేసవి అలవెన్స్‌లు ప్రకటించిందన్నారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ప్రతి కూలీకి పనులు కల్పించాలని ఆదేశించారన్నారు. కూలీలు పనులకు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో జేఈ నాగార్జున, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్ ఓబిలేసు తదితరులు ఉన్నారు.

విగ్రహ ఏర్పాటుకు విరాళం

కదిరి అర్బన్: గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో ఏర్పాటు చేస్తున్న వడ్డెర సత్తెన్న విగ్రహానికి గురువారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్ రూ.50 వేలను విరాళంగా నిర్వాహకులకు అందజేశారు.

వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకుల నియామకం


రమణారెడ్డి


శ్రీనివాసరెడ్డి


రఘునాథరెడ్డి


మల్లికార్జున

సాక్షి, పుట్టపర్తి: వైఎస్సార్ సీపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా మండలానికి ఓ పరిశీలకుడు, సహ పరిశీలకుడిని నియమించారు. ఈ మేరకు కొత్తచెరువు, బుక్కపట్నం మండలాలకు సంబంధించి పరిశీలకుడు, సహపరిశీలకుడిని గురువారం ఎంపిక చేసినట్లు పుట్టపర్తి ఎమ్మెల్యే కార్యాలయం సమన్వయ కర్త డీఎస్ కేశవరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తచెరువు మండల పరిశీలకుడిగా రమణారెడ్డి, సహ పరిశీలకుడిగా శ్రీనివాసరెడ్డిని ఎంపిక చేశారు. అదేవిధంగా బుక్కపట్నం మండల పరిశీలకుడిగా రఘునాథరెడ్డి, సహపరిశీలకుడిగా మల్లికార్జునను నియమించారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తామని పరిశీలకులు తెలిపారు. తమ ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

శ్మశాన వాటికలకు స్థల సేకరణ చేయాలి


కలెక్టర్ అరుణ్‌బాబును సన్మానిస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: దళితుల శ్మశాన వాటికలకు స్థల సేకరణ చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబును వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లెమీద నరసింహులు, మున్సిపల్ వైస్ చైర్మన్ తిప్పన్న కోరారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి సన్మానించారు. అనంతరం నరసింహులుతో కలిసి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. జిల్లాలో అర్హులైన డప్పు కళాకారులకు పింఛన్లు మంజూరు చేయాలన్నారు.

బీజేపీని సాగనంపాలి

తనకల్లు: రాష్ట్రాన్ని మోదీ ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాటమయ్య అన్నారు. మండల పరిధిలోని కొక్కంటి క్రాస్‌లో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ప్రచార భేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపి దేశాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ప్రత్యేక హోదా, పోలవరం నిధులు, రాజధాని నిర్మాణం, రైల్వేజోన్, రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చి అమలు చేయలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమంతురెడ్డి, కార్యదర్శి జీవీ రమణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజేంద్రప్రసాద్, డివిజన్ కార్యదర్శి కదిరెప్ప, మండల కార్యదర్శి రెడ్డెప్ప, సహాయ కార్యదర్శి చౌడప్ప యాదవ్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పరామర్శ

నల్లచెరువు: మండల పరిధిలోని సంజీవిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, వార్డు మెంబరు దొడ్డెప్ప (60) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, కదిరి ఏరియా ఆసుపత్రిలో ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సర్పంచుల సంఘం అధ్యక్షుడు దాసరి శ్రీనాథ్‌రెడ్డి ద్వారా రూ.50 వేల ఆర్థికసాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బొమ్మిరెడ్డి పల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

కదిరి అర్బన్: మండల పరిధిలోని కాళసముద్రం వద్ద కదిరి-అనంతపురం జాతీయ రహదారిపై గురువారం ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుంచి కదిరికి చెందిన ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పట్నం గ్రామానికి చెందిన నాగరాజు, గిరిబాబు రెడ్డిపల్లికి చెందిన చినరంగప్ప, కాళసముద్రం గ్రామానికి చెందిన శివమ్మకు గాయాలయ్యాయి. చికిత్సల నిమిత్తం కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. రూరల్ మండల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెమ్యునరేషన్ రేట్ల పెంపుపై హర్షం

ప్రశాంతి నిలయం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం విధుల్లో పాల్గొనే సిబ్బంది రెమ్యునరేషన్ పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఏపీ వైఎస్సార్‌టీఎఫ్ తరఫున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, విద్యాశాఖ మంత్రి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు వాటర్‌ప్లాంట్ ప్రారంభం

రామగిరి: పేరూరు డ్యాంలో రెన్యూ గాలిమరల కంపెనీ ఆధ్వర్యంలో వాటర్‌ప్లాంట్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి హాజరుకానున్నట్లు సర్పంచ్ సరస్వతి గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం కనగానపల్లి మండలం భానుకోటలో మరో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి, ఉదయం 11:30కు పేరూరు డ్యాంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

పేకాట రాయళ్ల అరెస్ట్

కొత్తచెరువు: సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సమీపంలోని పేకాట స్థావరంపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులు గురువారం దాడి చేశారు. 17 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.45 వేల నగదు, సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

నిత్యావసరాల పంపిణీ

పుట్టపర్తి టౌన్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని బుక్కపట్నం మండల కేంద్రంలోని టైలరింగ్ సెంటర్‌లో గురువారం ప్రభాత్ రూరల్ సొసైటీ ఆధ్వర్యంలో 50 పేద ముస్లిం కుటుంబాలకు సర్పంచ్ నాగలక్ష్మమ్మ చేతుల మీదుగా నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది ప్రభాకర్‌రెడ్డి, నాగమని పాల్గొన్నారు.

రాబోవు రోజుల్లో మరిన్ని పథకాలు


కుమ్మరవాండ్లపల్లిలో పథకాలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే సిద్దారెడ్డి

కదిరి అర్బన్: సీఎం వైఎస్ జగన్ రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి 1, 2 సచివాలయాల పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ రాబోవు రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు తీసువస్తారని తెలిపారు. నాడు-నేడు పథకంతో పేద విద్యార్థులకు కార్పొరేట్ తరహా బడులు నిర్మించారని పేర్కొన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన , విద్యా కానుక పథకాలు ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. డ్వాక్రా మహిళల రుణాలు కూడా మాఫీ చేశారని వెల్లడించారు. ఇవన్నీ ఓర్వలేని టీడీపీ నాయకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై బురదజల్లే కార్యక్రమాలు చేస్తున్నారని ఆరోపించారు. రాబోవు ఎన్నికల్లో ప్రజలే వారికి గుణపాఠం చెప్తారన్నారు. గ్రామంలో అక్కడక్కడ మిగిలిపోయిన చోట్ల సిమెంటు రోడ్లు వేయాలని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే.. వెంటనే ఎస్టిమేట్లు తయారు చేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. అలాగే మురుగు కాలువలు, కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు రాధాబాయి, సర్పంచ్ శాంతాబాయి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠ నాయక్, సచివాలయాల కన్వీనర్ మధుసూధన్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ప్రకాష్, సీనియర్ నాయకుడు ఆదినారాయణ, ఎంపీటీసీ పుల్లయ్య, ప్రభాకర్‌రెడ్డి, ఎస్టీ సెల్ నాయకుడు కృష్ణానాయక్, అగ్రి అడ్వైజరీ బోర్డు జిల్లా మెంబర్ సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యేలు


ముదిగుబ్బ: ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి


భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

కదిరి టౌన్/కదిరి అర్బన్: పట్టణంలోని నల్లగుట్ట వీధిలో ఉన్న ఖాజా సుబహానియా మసీదులో గురువారం ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లింలతో కలిసి భోజనం చేశారు. మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్ల జామియా మసీదులో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకుడు కేవీ సురేష్‌రెడ్డి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి, పట్టణాధ్యక్షుడు కేఎస్ బాహుద్దీన్, కుమ్మరవాండ్లపల్లి మాజీ సర్పంచ్ బత్తల వెంకటరమణ, లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు లింగాల లోకేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.
ముదిగుబ్బ: మండల కేంద్రంలోని జామియా మసీదులో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు

ప్రత్యేక హోదా కోసం సైకిల్‌యాత్ర


మాట్లాడుతున్న ప్రసాద్

ధర్మవరం అర్బన్: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, రైల్వేజోన్ కోసం సైకిల్‌యాత్ర చేపట్టినట్లు వికలాంగుడు ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన చేపట్టిన సైకిల్ యాత్ర ధర్మవరానికి చేరుకుంది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం శ్రీకాకుళం జిల్లా నుంచి కంచిలీ మండలం బురగా గ్రామం నుంచి 2018లోనే ఇచ్చాపురం నుంచి ఉమ్మడి జిల్లా అనంతపురానికి మూడు చక్రాల సైకిల్ యాత్రను ప్రారంభించానన్నారు. అయితే కరోనా కారణంగా 2020లో నంద్యాల వరకూ యాత్ర చేపట్టి, నిలిపివేశానన్నారు. అనంతరం ఈ ఏడాది జనవరి మొదటి వారం నుంచి సైకిల్ యాత్రను ప్రారంభించినట్లు తెలిపారు. 23 జిల్లాల్లో ఈ సైకిల్ యాత్ర నిర్వహించి, ఢిల్లీకి వెళ్తానన్నారు. జిల్లాలో ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని, సమస్యలను ఢిల్లీ పెద్దల దృష్టికి తీసుకెళ్తానన్నారు. శుక్రవారం ఉదయం బయలుదేరి లేపాక్షి వరకూ ఈ యాత్రను కొనసాగిస్తానని వివరించారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

తలుపుల: మండలంలో కొత్తగా పాస్‌బుక్‌లు తీసుకున్న రైతులు రైతు భరోసా సాయం కోసం ఈనెల 30వ తేదీలోపు ఆర్బీకేల్లో దరఖాస్తు చేసుకోవాలని ఏఓ షాదాబ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డు, వన్‌బీ, పాస్‌బుక్ జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్‌తో పాటు, ఫోన్ నంబర్, వ్యక్తి చనిపోయి ఉంటే డెత్ సర్టిఫికెట్ తీసుకుని దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.